క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 15న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. నయీంనగర్, లష్కర్ సింగారం, రాజాజీనగర్ ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, కిషన్‌పుర లష్కర్ బజార్, సిక్‌వాడ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఏసియన్ శ్రీదేవి మాల్, ఏకశిల ఆస్పత్రి, కంచరకుంట, సెంటినరీ బాప్టిస్ట్ చర్చి, బీఈడీ కళాశాల, బాలసముద్రం, చిల్డ్రన్ పార్కు, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, మున్సిపల్ కమిషనర్ క్యాంపు కార్యాలయం ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు. అలాగే, వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు మంగళవారం ఆటంకం కలగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. షాదీఖానా, నర్సంపేట రోడ్డు, టెలికం కాలనీ, తిలక్ రోడ్డు, భారత్ గ్యాస్ గోదాం వీధి, బీరన్నకుంట, ఎస్ఆర్ఆర్ తోట, శాంతినగర్, పెరకవాడ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఉదారత చాటిన ఉపాధ్యాయుడు



వరంగల్ చౌరస్తా: ప్రాథమిక పాఠశాల భవనాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు అదే పాఠశాలకు చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు ముందుకొచ్చాడు. వరంగల్ 3వ డివిజన్‌కు చెందిన పైడిపల్లి ప్రాథమిక పాఠశాల భవనానికి గతంలో వేసిన రంగులు వెలిసిపోయి కళావిహీనంగా భవనం మారింది. దాంతో అవసరమైన రంగుల డబ్బాలను ప్రధాన ఉపాధ్యాయుడు బాదావత్ దాస్రుకు ఎస్జీటీ ఉపాధ్యాయుడు పత్తి శ్రీరాములు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, శ్రీను, పద్మ, వసంత, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు షూస్ పంపిణీ



రామన్నపేట: ఏవీవీ హైస్కూల్ విద్యార్థులకు నగరానికి చెందిన వ్యాపారవేత్త, వెంకటేశ్వర గార్డెన్ యజమాని శ్రీరాం షూస్, సాక్స్‌లు అందజేసినట్లు ప్రిన్సిపాల్ భుజేందర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మట్టెవాడ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గోపి, స్థానిక కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి, ఏవీవీ విద్యాసంస్థల కార్యదర్శి చందా విజయ్ కుమార్, శాశ్వత సభ్యుడు చందా శ్రీకాంత్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

భూ తగాదాల్లో జోక్యం చేసుకుంటే చర్యలు



హసన్‌పర్తి: భూ తగాదాలు, కొట్లాటలకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవని హనుమకొండ ఏసీపీ నర్సింహారావు హెచ్చరించారు. హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లకు సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే పీడీయాక్ట్ నమోదు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీస్ ఇన్‌స్పెక్టర్ మచ్చ శివకుమార్, ఎస్సైలు కిశోర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగింత

కాజీపేట: కాజీపేట 60వ డివిజన్ వడ్డెపల్లి రోడ్డులో సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితుడికి ట్రాఫిక్ కానిస్టేబుల్ దేవేందర్ సోమవారం అప్పగించారు. వడ్డేపల్లి రోడ్డులో విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ దేవేందర్ ఫోన్ కనిపిందించింది. సెల్‌ఫోన్‌లో ఉన్న నంబర్‌కు ఫోన్ చేసి బాధితుడు గోవిందుల రవీందర్‌ను పిలిపించి స్మార్ట్‌ఫోన్ అందజేశారు.

కిక్ బాక్సింగ్ పోటీల్లో సాత్విక్‌కు బంగారు పతకం

ఖిలా వరంగల్: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో తెలంగాణ వాకో కిక్ బాక్సింగ్ ఆధ్వర్యంలో ఇటీవల కాడెట్స్, జూనియర్స్ రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ కటాస్ చాంపియన్ షిప్ -2025 పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో వరంగల్ ఎస్ఆర్ఆర్ తోట కేవీ పబ్లిక్ హైస్కూల్ విద్యార్థులు ఎస్.సాత్విక్ పాల్గొని బంగారు పతకం, జె.లలిత్ వెండి పథకం సాధించారు. ఈ మేరకు వారిని ప్రిన్సిపాల్ దాసి సతీష్‌మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ అన్నదేవర ప్రవీణ్‌కుమార్, కిక్ బాక్సింగ్ కోచ్‌లు బండారి సంతోష్, రణదీప్, జి.వైష్ణవి, తదితరులు అభినందించారు.

రోడ్డు మీదే వ్యాపారం

- భారీ వాహనాలతో ప్రమాదాలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

కాజీపేట: ఓవైపు ఇరుకు రోడ్డు.. నడవలేని దుస్థితి.. మరోపక్క భారీ వాహనాల రాకపోకలు వెరసి రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. మార్కెట్ ఉన్నా అక్కడ కూరగాయలు అమ్మకుండా రోడ్డుపైనే కూరగాయలు విక్రయిస్తూ నిత్యం ట్రాఫిక్‌కు అడ్డంకులు సృష్టిస్తున్నా కార్పొరేషన్ అధికారులు మాత్రం పట్టించుకోకపోవడం కాజీపేట పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

ట్రాఫిక్‌కు అంతరాయం

ప్రభుత్వ నిధులు వెచ్చించి 63వ డివిజన్ బాపూజీనగర్‌లో వెంకటలక్ష్మి కూరగాయల మార్కెట్‌ను ప్రభుత్వం నిర్మించింది. అయినా అక్కడ కూరగాయలు అమ్మకుండా కొంతమంది వ్యాపారులు, ప్రధాన చౌరస్తా నుంచి మార్కెట్ మీదుగా టేకులగూడం, సోమిడి వెళ్లే రహదారి మధ్యలో అమ్ముతుండడంతో నిత్యం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. అసలే ఇరుకు రోడ్డు, ఆపై భారీ వాహనాల రాకపోకలతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు కూరగాయలు కొనుగోలు చేసేవారు రోడ్డుపైనే వాహనాలు నిలుపుతుండడంతో వచ్చిపోయే వాహనదారులు, బాటసారులు అనేక ఇక్కట్లు పడుతున్నారు.



మార్కెట్‌కు వెళ్లే మార్గంలో రోడ్డుపైనే కూరగాయలు, పండ్లు అమ్ముతున్న వ్యాపారులు



ఇరుకు రోడ్డుపై వెళ్తున్న భారీ వాహనం

వాహనాలతో నిత్యం రద్దీగా..

ఈ ప్రాంతంలో ఆరు గ్రానైట్ ఫ్యాక్టరీలు ఉండడంతో అనేక వాహనాలు వేళాపాల లేకుండా వచ్చిపోతుంటాయి. మరో పక్క ట్రాక్టర్లు, ఆటోలు గిరాగిరా తిరుగుతుంటాయి. ఉదయం ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే ప్రయాసే. మార్కెట్‌ను వదిలి రోడ్లపై ప్రజలు ఇబ్బందులు పడేలా అమ్మకాలు సాగిస్తున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోకుండా అడ్డా అద్దెలు వసూలు చేస్తుండడం చర్చనీయాంశంగా మారింది. ఈ రోడ్డులో ప్రభుత్వ ఐటీఐ, ఆరు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, మూడు ఇంజనీరింగ్ ఫార్మసీ కళాశాలలు, శ్మశాన వాటికలు ఉన్నాయి. పిల్లల కోసం తరచూ ఆటోలు, స్కూల్ బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. గతంలో ఓ ట్రాక్టర్, లారీ అదుపుతప్పి రోడ్డు పక్కన కూరగాయలు విక్రయిస్తున్న వ్యక్తులపైకి దూసుకెళ్లిన ఘటనలో ఇద్దరు మరణించగా, పలువురు ఆస్పత్రుల పాలైన విషయం సంబంధిత అధికారులకు తెలిసినా నివారణ చర్యలు మాత్రం చేపట్టలేదు. రోడ్లపై విక్రయాలను నిలిపి వేయాలని పలుమార్లు మున్సిపల్ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేసినా ఫలితం లేదనే విమర్శలున్నాయి.

ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలి



కూరగాయల మార్కెట్‌కు వెళ్లే రహదారికి ఇరువైపులా కూరగాయలు, పండ్ల విక్రయాలను నివారించాలి. నిత్యం ఈ రోడ్డుపై లారీలు, ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో నిత్యం ట్రాఫిక్ స్తంభిస్తున్నా పట్టించుకునే వారు లేరు. ట్రాఫిక్ పోలీసులు మార్కెట్ రోడ్డులో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలి. ఈ రోడ్డులో ప్రయాణించడానికి ప్రజలు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. పోలీసులు ఆ దిశగా దృష్టి సారించి సమస్య తీవ్రతను తగ్గించాలి.

– సుంచు వేణు, కాజీపేట

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు



ప్రొసీడింగ్ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

హసన్‌పర్తి: ఇందిరమ్మ రాజ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. 14వ డివిజన్‌లోని లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాల ప్రొసీడింగ్ పత్రాలను హనుమకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా లబ్ధిదారులకు ఎంపిక చేసినట్లు చెప్పారు. ఇళ్ల మంజూరు నిరంతర ప్రక్రియగా పేర్కొన్నారు. ఇళ్లు రాలేదని ఎవరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలో రేషన్ కార్డులపై సన్న బియ్యాన్ని అందజేస్తున్నట్లు వివరించారు. సుందరయ్య నగర్, ఎన్టీఆర్ నగర్, ఎస్సార్ నగర్ పేదలకు పట్టాలు ఇప్పించడానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ తూర్పాటి సులోచన, డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్, కిరణ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు రాజేష్, శంకర్, జానీ, చిన్ని, స్టాలిన్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలంతా ఏకం కావాలి: బీఆర్ఎస్



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

హన్మకొండ: బీసీలు ఏకం కావాలని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ పిలుపునిచ్చారు. వెనుకబడిన తరగతుల ప్రజాప్రతినిధుల వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హలో బీసీ.. చలో హైదరాబాద్ కార్యక్రమ వాల్‌పోస్టర్లను హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలతో కాంగ్రెస్ ఓట్ల రాజకీయం చేస్తోందని ఆరోపించారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు బడ్జెట్‌లో రూ.20 వేల కోట్ల నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్.. గడిచిన రెండు బడ్జెట్లలో కేవలం రూ.7 వేల కోట్లు, రూ.9 వేల కోట్ల మాత్రమే కేటాయించిందని అన్నారు. ఈ నెల 15న హైదరాబాదులోని ఇందిరాపార్కు వద్ద నిర్వహించనున్న బీసీల మహాధర్నాకు బీసీలు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సోదా కిరణ్, బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

కేయూలో ప్రాంగణ నియామకాలు



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 52 మంది విద్యార్థులు ప్రాంగణ నియామకాల్లో ఎంపికయ్యారు. బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్న ఆ విద్యార్థులను హైదరాబాద్‌లోని ప్రముఖ సంస్థ స్ప్రైడర్‌లో క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ఎంపిక చేసిందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రమణ తెలిపారు. శిక్షణ సమయంలో వార్షిక వేతనం రూ 3.60 లక్షల వరకు ఉంటుందని, శిక్షణ అనంతరం ప్రతిభ ఆధారంగా వార్షిక వేతనం రూ.7.20 లక్షల వరకు ఉంటుందని కేయూ ప్లేస్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ చిర్ర రాజు వివరించారు. సోమవారం ఆ విద్యార్థులను వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం, ప్రిన్సిపాల్ రమణ, ప్లేస్‌మెంట్ అధికారులు సంతోష్‌కుమార్, సిద్ధార్థ అభినందించారు.

వ్యాస సంపుటి పుస్తకం ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జర్నలిజం విభాగం అధ్యాపకుడు డాక్టర్ ఆర్.ఆదిరెడ్డి రచించిన సామాజిక విద్య, వైద్య, ఆర్థిక, వ్యవసాయ రంగంపై రచించిన వ్యాస సంపుటి పుస్తకాన్ని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రంతో కలిసి వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి, డాక్టర్ హరికుమార్, పాత్రికేయుడు రమేష్, కేయూ అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

రిజర్వేషన్ల అమలు బాధ్యత అందరిది

- పూలే ఆశయ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు సంగని మల్లేశ్వర్



సమావేశంలో మాట్లాడుతున్న మల్లేశ్వర్

కేయూ క్యాంపస్: బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాల్సిన బాధ్యత అన్ని పార్టీలపై ఉందని పూలే ఆశయ సాధన సమితి (పాస్) రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సంగని మల్లేశ్వర్ అన్నారు. కాకతీయ యూనివర్సిటీలోని జర్నలిజం విభాగంలో పూలే ఆశయ సాధన సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ తాడూరి శాస్త్రి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సమావేశంలో మల్లేశ్వర్ మాట్లాడారు. ఏడు దశాబ్దాలుగా బీసీలకు రిజర్వేషన్ల అమలులో తీవ్ర నిర్లక్ష్యం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఏ ప్రభుత్వమూ చేయని బీసీ రిజర్వేషన్లకు నేటి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిందని కొనియాడారు. అందులో భాగంగానే బీసీల కులగణన చేపట్టిందన్నారు. బీసీ రిజర్వేషన్‌కు కేంద్రం చట్టబద్ధత కల్పించకుండా జాప్యం చేస్తోందని విమర్శించారు. సమావేశంలో పూలే ఆశయన సాధన సమితి రాష్ట్ర కార్యదర్శి చందా మల్లయ్య, బాధ్యులు డాక్టర్ నల్లాని శ్రీనివాస్, శ్రీరాం వీరయ్య, డాక్టర్ వంగల సుధాకర్ పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా వెంటనే చెల్లించాలి



వినతిపత్రం చూపుతున్న సంఘం నాయకులు

హన్మకొండ అర్బన్: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న గీత కార్మికుల ఎక్స్‌గ్రేషియాను వెంటనే విడుదల చేయాలని కల్లుగీత కార్మిక సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గౌని సాంబయ్య గౌడ్, బుర్ర శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బాధిత కుటుంబ సభ్యులతో కలిసి హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కల్లుగీత కార్మికులకు పెండింగ్‌లో ఉన్న రూ.12.90 కోట్ల ఎక్స్‌గ్రేషియాలను వెంటనే విడుదల చేసి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. గీత కార్మికులందరికీ సేఫ్టీ మోకులను అందించాలని సూచించారు. కార్యక్రమంలో బుర్ర సుధాకర్‌గౌడ్, వల్లాల గంగాధర్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి నర్సయ్య, జిల్లా కమిటీ సభ్యులు మోడం రాజేందర్, కోతి సాంబరాజు, సారా వెంకటేష్, చిర్ర నర్సింగ్, గట్టు శ్రీధర్ పాల్గొన్నారు.

బహుజన గణమన పుస్తకం ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సంఘాల బాధ్యులు

కేయూ క్యాంపస్: ప్రముఖ కవి జూలూరి గౌరీశంకర్ రచించిన బహుజన గణమన దీర్ఘకవితా పుస్తకాన్ని కేయూ బహుజన రచయితల సంఘం కన్వీనర్ డాక్టర్ కర్రె సదాశివ్ అధ్యక్షతన కాకతీయ యూనివర్సిటీలోని దూరవిద్య కేంద్రం వద్ద సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేయూ పాలక మండలి సభ్యుడు డాక్టర్ చిర్ర రాజు మాట్లాడుతూ ఈ గ్రంథం బహుజన మహాకావ్యం అని, తెలంగాణ పనిపాటల ఆత్మను వ్యక్తీకరిస్తూ అట్టడుగున నలిగిన బహుజన ప్రజల ఉద్యమాన్ని బలమైన భావజాలంతో రచించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

మా కష్టాలు తీర్చండి

- బల్దియా ఎదుట పలు కాలనీవాసుల ధర్నా



ధర్నా చేస్తున్న పలు కాలనీవాసులు, నాయకులు

వరంగల్ అర్బన్: కాలనీల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని పలు కాలనీల వాసులు బల్దియా గ్రీవెన్స్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హనుమకొండ 31వ డివిజన్ రాజీవ్ గృహకల్ప ఫేజ్ -1 మల్లు స్వరాజ్యం నగర్‌లో 450 కుటుంబాలు నివసిస్తున్నాయని అన్నారు. కాలనీలో విద్యుత్, తాగునీరు, రోడ్డు సదుపాయం లేదని, ఇంటి నంబర్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే, 43వ డివిజన్ లక్ష్మీపురం కాలనీలో నల్లా నీరు, విద్యుత్, డ్రెయినేజీ, సీసీ రోడ్లు లేవని ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు 700 కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని పేర్కొన్నారు. అనంతరం కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌కి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నలిగంటి రత్నమాల, అరూరి రమేష్, సింగారపు బాబు, గున్నాల ప్రభాకర్, సాంబమూర్తి, అప్పాజీ వాణి, మూడేళ్ల ఉపేందర్, దివ్య, సదానందం, మురళి, కిరణ్, మహబూబ్ పాషా, ఎండీ.బేగం, ఎండీ.మాషుబీ, సూరయ్య, లక్ష్మి, రజిత, విజయ, తదితరులు పాల్గొన్నారు.

భట్టి విక్రమార్క వ్యాఖ్యలపై నిరసన



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

వరంగల్ చౌరస్తా: రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అనుచిత వ్యాఖ్యలు సరికాదని బీజేపీ ఎస్సీ మోర్చా నాయకులు విమర్శించారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావుపై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ వరంగల్ హెడ్ పోస్టాఫీస్ సెంటర్‌లో భట్టి విక్రమార్క దిష్టిబొమ్మను సోమవారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ మోర్చా వరంగల్ జిల్లా అధ్యక్షుడు పోలెపాక మార్టిన్ లూథర్ మాట్లాడుతూ బీఆర్.అంబేడ్కర్ అవమానించిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బన్న ప్రభాకర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్ షా, పొన్నాల వెంకటరమణ, నాయకులు బాకం హరిశంకర్, ఎరుకాల రఘునారెడ్డి, కనుకుంట్ల రంజిత్, బైరి శ్యామ్, కూచన క్రాంతి, సంద్ర మధు, జనార్దన్, జిలకర వీరస్వామి, దామెర సదానందం పాల్గొన్నారు.

గురుకులంలో ఫ్రెషర్స్ డే వేడుకలు



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

మడికొండ: మండలంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో 2025-26వ విద్యా సంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందిన విద్యార్థినులకు స్వాగతం పలుకుతూ విద్యార్థినులు, ఉపాధ్యాయులు సోమవారం ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించినట్లు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, హనుమకొండ జిల్లా సమన్వయ అధికారి డి.మహేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులు నిర్వహించిన నృత్య ప్రదర్శన, నాటికలు, ఉపన్యాసాలు ఆకట్టుకున్నాయని అన్నారు. విద్యార్థినులు పాఠశాల, కళాశాల వాతావరణానికి అలవాటు పడి, సమయపాలన పాటిస్తూ క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తూ ఉన్నత స్థాయిలో ఎదగడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో తోడ్పడుతాయని తెలిపారు.

కేయూ భూములను కాపాడాలి

హన్మకొండ అర్బన్: అన్యాక్రాంతమవుతున్న కాకతీయ యూనివర్సిటీ భూములను కాపాడాలని, యూనివర్సిటీ భూమిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం చేపట్టొద్దని కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో ప్రజావాణి కలెక్టర్ స్నేహ శబరీష్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో డీఎస్ఏ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రావణ్, ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం నాగార్జున, పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి మర్రి మహేష్, ఎస్ఎస్‌యూ హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఎల్తూరి సాయికుమార్, ఏఐడీఎస్ఓ జిల్లా ఉపాధ్యక్షుడు మధు, బీఆర్ఎస్వీ నాయకుడు పస్తం అనిల్ కుమార్, డీఎస్ఏ జిల్లా కన్వీనర్ ఉప్పుల శివ, నాయకులు శరత్, శివ, సంజయ్ పాల్గొన్నారు.

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ భూములను కాపాడాలని, యూనివర్సిటీలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మించొద్దని కాకతీయ యూనివర్సిటీలోని వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులు కోరారు. ఈ మేరకు కేయూకు వచ్చిన సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చలపతికి సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్, ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం నాగార్జున, డీఎస్ఏ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రావణ్, ఎస్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్, ఏఐడీఎస్ఓ జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్ పాల్గొన్నారు.

వరంగల్ చౌరస్తా: యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణాన్ని కాకతీయ యూనివర్సిటీ భూమిలో నిర్మించకుండా చొరవ తీసుకోవాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు వరంగల్ అండర్ బ్రిడ్జి ఓంకార్ భవన్‌లో ఎంసీపీఐ (యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవిని కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మాస్ సావిత్రి, గడ్డం నాగార్జున, కామగోని శ్రావణ్, మహేష్, ఎల్తూరి సాయికుమార్, మధుసూదన్, శివ, రాజు, చెట్టుపల్లి శివ కుమార్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

బాధితులకు ఆర్థిక సాయం అందించాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో తాత్కాలిక బోధనేతర ఉద్యోగులుగా పనిచేస్తూ అకాల మరణం పొందిన ఉద్యోగుల కుటుంబాలకు ఇవ్వాల్సిన ఆర్థిక సహకారాన్ని వెంటనే అందించాలని విశ్వ విద్యాలయ కాంట్రాక్టు బోధనేతర ఉద్యోగ సంఘాల బాధ్యులు కోరారు. ఈ మేరకు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రంకు సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల బాధ్యులు డాక్టర్ విష్ణువర్ధన్, నాగుల శివప్రసాద్, కొడవటిగంటి దయాకర్, గోపి, బాధిత కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ నాయకులపై దాడిని ఖండించాలి

ఖిలా వరంగల్: ఏఐఎస్ఎఫ్ నాయకులపై జరిగిన దాడులను అన్ని వర్గాల ప్రజలు ఖండించాలని ఏఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి ల్యాదల్ల శరత్ కోరారు. దాడికి యత్నించిన బీజేవైఎం దుండుగులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో వరంగల్‌లో ప్లకార్డులు ప్రదర్శిస్తూ సోమవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శివ, సంతోష్, ప్రశాంత్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

రవాణా యాప్‌లను రద్దు చేయాలి

హన్మకొండ అర్బన్: రాపిడో, ఓలా, ఉబర్ లాంటి రవాణా యాప్‌లను రద్దు చేయాలని కాకతీయ ఆటో డ్రైవర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాయకంటి రఘు డిమాండ్ చేశారు. ఈ మేరకు యూనియన్ ఆధ్వర్యంలో నగరంలోని పబ్లిక్ గార్డెన్ నుంచి కలెక్టరేట్ వరకు సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్‌ను కలిసి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ రాపిడో, ఓలా, ఉబర్ లాంటి యాప్‌లు ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదని, పసుపు రంగు ఉన్న నంబర్ ప్లేట్‌లను ఉపయోగించడం లేదని అన్నారు.

రేపు బ్యాండ్ కళాకారుల రాష్ట్ర సదస్సు

నయీంనగర్: బ్యాండ్, వాయిద్యా కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ బ్యాండ్, వాయిద్యా కళాకారుల సంఘం కన్వీనర్ గుమ్మడి రాజు నాగరాజు కోరారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కళాకారులకు గుర్తింపు కార్డులు, 50 ఏళ్లకు పింఛన్, ఇందిరమ్మ ఇళ్లు, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 16న హనుమకొండ పోచమ్మకుంట ఫైన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కాడబోయిన లింగయ్య, రాజా సాహెబ్, చాంద్‌పాషా, వెంకన్న, ఎండీ.చాంద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్పీకి అభినందన

రామన్నపేట: వరంగల్ ఏఎస్పీగా బాధ్యతలు చేపట్టిన శుభంను మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో పట్టణ ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు మొక్క అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గట్టు మహేష్‌బాబు, చక్కిలం ఉపేందర్, ఓలం ఉపేందర్, కల్లూరి లక్ష్మీనరసయ్య, ఆకారపు శశిధర్, తాటిపల్లి రాజేశ్వరరావు, మనుగోటి రమేష్, తాటికొండ రాము, చిదర అంజనీదేవి, యాద విద్యాసాగర్, సదాకుమార్, వీరేశలింగం, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సర్వేయర్ల శిక్షణ

హసన్‌పర్తి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన లైసెన్స్‌డ్ సర్వేయర్ల శిక్షణ కార్యక్రమం కొనసాగుతోంది. ఈ మేరకు ఆధునాతన సర్వే (డీజీపీఎస్) ప్రకియ గురించి సోమవారం శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో లైసెన్స్‌డ్ సర్వేయర్ సంఘం జిల్లా అధ్యక్షుడు పెసరు బొందయ్య, ప్రధాన కార్యదర్శి రమేష్, చుంచు రవి పాల్గొన్నారు.

పొదుపు సంఘంలో అవినీతిపై ఫిర్యాదు

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం జయగిరిలోని సాయిబాబా మహిళా పొదుపు సంఘంలో అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయని సంఘం సభ్యురాలు రాధిక సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్ స్నేహ శబరీష్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. సంఘంలో తాను సభ్యురాలిగా ఉన్నప్పటికీ తనకు తెలియకుండానే తన సంతకం ఫోర్జరీ చేసి రుణం తీసుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తనతో పాటు తన అత్త రాధ పేరిట కూడా రుణం తీసుకుని పంచుకున్నారని తెలిపారు. పొదుపు సంఘంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించి న్యాయం చేయాలని కోరారు.

ద్విచక్ర వాహనాల చోరీ నిందితుడి అరెస్ట్

రామన్నపేట: వరంగల్ మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆటోనగర్ వద్ద పోలీసులు సోమవారం వాహనాలు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో పోచమ్మమైదాన్‌కు చెందిన ద్విచక్ర వాహనాల చోరీ నిందితుడు బరుపట్ల సాయిని అదుపులోకి తీసుకున్నట్లు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి తెలిపారు. అతడు ఇళ్లు, కిరాణ షాపులు, బార్ షాపులల్లో చోరీలకు కూడా పాల్పడ్డాడని వివరించారు. సాయిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపడంతో పాటు అతడి నుంచి రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ గోపి వివరించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

న్యూశాయంపేట: ఎంజీఎంలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి సోమవారం మృతి చెందాడు. ఏనుమాముల ఇన్‌స్పెక్టర్ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం నాలుగు రోజుల క్రితం పైడిపల్లి సెంటర్‌లో అనారోగ్యంతో ఓ వ్యక్తి పడిఉండగా, గ్రామస్తులు 108 నంబర్‌కు సమాచారం ఇచ్చి ఎంజీఎంకు తరలించారు. ఈ క్రమంలో అతడు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. వివరాలకు 87126 85288 లేదా ఏనుమాముల పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ సూచించారు.

శ్వేతార్క నిర్వాహకుడికి సన్మానం

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రం నిర్వాహకుడు అయినవోలు రాధాకృష్ణ శర్మ సిద్ధాంతిని పుష్పగిరి పీఠాధిపతి అభినవోద్దండ విద్య భారతీ స్వామి సోమవారం సన్మానించారు. శ్వేతార్క ఆలయంతో పాటు భద్రకాళి ఆలయ ఆస్థాన పండితుడిగా, విద్వత్ సభ ఉపాధ్యక్షుడిగా రాధాకృష్ణ కొనసాగుతున్నారు.

కష్టపడిన వారికే పదవులు

హసన్‌పర్తి: పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికే పదవులు దక్కుతాయని బీఆర్ఎస్ 66వ డివిజన్ అధ్యక్షుడు, స్థానిక సంస్థల ఎన్నికల అన్నాసాగరం గ్రామ పార్టీ ఇన్‌చార్జ్ పావుశెట్టి శ్రీధర్ అన్నారు. హసన్‌పర్తి మండలం అన్నాసాగరంలో సోమవారం జరిగిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్, ఆత్మ మాజీ చైర్మన్ కందుకూరి చంద్రమోహన్, నాయకులు భగవాన్‌రెడ్డి, ఇమ్మడి రాజేందర్, బుచ్చిరెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ జెడ్పీటీసీ సరితకు నివాళి

హన్మకొండ: వేలేరు మాజీ జెడ్పీటీసీ చాడా సరితకు బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్, పార్టీ నాయకులు నివాళి అర్పించారు. వేలేరు మండలం మల్లికుదుర్లలోని స్వగృహంలో సరిత మృతదేహాన్ని సోమవారం సందర్శించి పూలమాల ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, నాయకులు పులి రజనీకాంత్, నార్లగిరి రమేష్, మోటె చిరంజీవి, గంధ్రకోట రాకేష్ యాదవ్, గొల్లపెల్లి వీరస్వామి పాల్గొన్నారు.